సాక్షి
అన్నమయ్య జిల్లా
ఆదివారం । 22 । జనవరి । 2023



శాస్త్రీయ దృక్పథంతోనే ఆలోచనల అభివృద్ధి

ఆలోచనలు శాస్త్రీయ దృక్పథంతో సాగితే సమాజం అభివృద్ధి చెందుతుందని జేవీవీ నాయకుడు లక్ష్మణరావు అన్నారు. - 8లో



అయ్యో.. చిన్నారితల్లి

తొమ్మిదో తరగతి విద్యార్థిని ప్రసవించిన సంఘటన శనివారం వాల్మీకిపురంలో చోటు చేసుకొంది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.190	రూ.280
రెండోరకం	రూ.100	రూ.186

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 151 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

ఫిబ్రవరి 5న ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలు

రాయచోటిటౌన్ : జాతీయ ఉపకార వేతన పరీక్షలు (ఎన్‌ఎంఎంఎస్)ఫిబ్రవరి 5వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించనున్నట్లు అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు హాల్ టిక్కెట్లు వెబ్‌సైట్ www. br-e.a p.g-o-v.i n స్కూల్ లాగిన్ ద్వారా పొందవచ్చన్నారు.

నేషనల్ కం మెరిట్ స్కాలర్‌షిప్ జమ

రాయచోటిటౌన్ : నేషనల్ కం- మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలలో 2021-2022 సంవత్సరానికి సంబంధించి ఎంపికై న విద్యార్థులకు వారి ఖాతాలలో స్కాలర్ షిఫ్ రుసుము జమ చేశామని అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డి తెలిపారు. కొందరు విద్యార్థుల బ్యాంకు ఖాతా వివరాలు తప్పుగా నమోదు కావడం వలన వారి ఖాతాలలో స్కాలర్‌షిప్ జమ కాలేదన్నారు. అలాంటి తప్పులు కనిపించిన విద్యార్థులకు దరఖాస్తులో పొందుపరిచిన ఫోన్ నంబర్లకు మెసేజ్‌లు కూడా పంపించారని చెప్పారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు తరచూ విద్యార్థుల లాగిన్ తనిఖీ చేస్తూ ఉండాలని సూచించారు.

25న నందలూరులో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు



నందలూరు(రాజంపేట): రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి జన్మదిన సందర్భంగా 25న నందలూరులో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు మండల కో-ఆప్షన్ సభ్యుడుక లీం, నిర్వాహకులు పల్లె గ్రీష్మంత్‌రెడ్డి, ముమ్మడిశెట్టి సుధాకర్, పెంచలయ్య, పుత్తాశంకర్‌లు తెలిపారు. మొదటి బహుమతి రూ.10వేలు, ద్వితీయబహుమతి రూ.7వేలు, తృతీయబహుమతి రూ.5వేలు, కన్సొలేషన్ బహుమతి రూ.3వేలు ఇస్తామని ప్రకటించారు. 24వ తేదీలోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. 9000527227, 8309199305, 986601562 నంబర్లలో సంప్రందించాలన్నారు. బుధవారం ఉదయం అరవపల్లెలోని జిల్లాపరిషత్ క్రీడామైదానంలో కబడ్డీ పోటీలు ప్రారంభమవుతాయన్నారు.

వసతి గృహాల్లో వందశాతం మెనూ అమలు చేయాలి

రాయచోటి అర్బన్: ప్రభుత్వ వసతి గృహాల్లో వందశాతం మెనూను అమలు చేయాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవని అన్నమయ్యజిల్లా ఎస్సీ వసతిగృహ సంక్షేమాధికారి జాకీర్‌హుస్సేన్ తెలిపారు. శనివారం రాయచోటి ఏఎస్‌డబ్ల్యూ పరిధిలోని ఎస్సీ వసతిగృహాల సంక్షేమాధికారుల పనితీరుపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లల ఆరోగ్య పరిరక్షణకు ప్రథమ ప్రాధాన్యత యిచ్చి వసతిగృహాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వసతిగృహాల్లో ఉంటూ 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేక శిక్షణా తరగతులను నిర్వహించి 100శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వాన్ని సహించబోమన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూఓ రఘురామయ్య, పలువురు వసతిగృహ సంక్షేమాధికారులు పాల్గొన్నారు.



ఆటలాడుకుందాం..

సాక్షి రాయచోటి: అత్యున్నత క్రీడాకారులను తయారు చేయాలంటే అందుకు తగ్గట్టుగా మైదానాలు ఉండాలి. చాలాచోట్ల క్రీడలకు సంబంధించి ఆటపాటలు లేని పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం క్రీడల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. పునర్విభజనలో భాగంగా కొత్తగా ఏర్పడిన అన్నమయ్య జిల్లాలో క్రికెట్ స్టేడియంతోపాటు ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు అధికారులు ప్రణాళిక రూపొందించారు. అక్కడ క్రికెట్ మైదానం, ఇతర అన్ని క్రీడలకు ప్రత్యేకంగా కోర్టులు ఏర్పాటు చేసేలా వడివడిగా అడుగులు పడుతున్నాయి. మైదానాల ఏర్పాటు కోసం దాదాపు 25 ఎకరాల స్థల సేకరణ కూడా చేశారు. అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో క్రీడాకారులకు అనువుగా మైదానాలను తయారు చేసేందుకు అధికారులు ముందుకు కదులుతున్నారు. రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని దిగువ అబ్బవరం ప్రాంతంలోని నక్కావాండ్లపల్లె వద్ద క్రికెట్ స్టేడియం, ఫుట్‌బాల్, ఫీల్డ్, స్పోర్ట్స్ కాంప్లెక్స్ బిల్డింగ్, అథ్లెటిక్ ట్రాక్, వాలీబాల్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్ కోర్టులు, స్విమ్మింగ్ పూల్, మల్టీపర్పస్ హాలు, కబడ్డీ తదితర ఆటలకు సంబంధించిన కోర్టులు, ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు సంబంధించి వేగంగా పనులు జరుగుతున్నాయి. ఎంపిక చేసిన స్థలంలో ఇప్పటికే జంగిల్ క్లియరెన్స్‌తో పాటు చదును చేసే కార్యక్రమం ఊపందుకుంది. ఇక్కడ క్రికెట్, ఇండోర్ స్టేడియాలను సుమారు రూ. 50 కోట్లతో నిర్మించాలని ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించారు.

ఉత్తమ క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యం

ఖేలో ఇండియా పథకం కింద ఉత్తమ క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యంగా స్టేడియం నిర్మాణానికి చర్యలు చేపడుతున్నారు. చుట్టూ పచ్చికతో పాటు గ్యాలరీలు, ఇతర భవనాలతోపాటు ఇండోర్ స్టేడియంలో ఇతర అన్ని క్రీడలకు ప్రాధాన్యత ఉండేలా చూస్తున్నారు.కలెక్టర్ గిరీషా పీఎస్ ఇప్పటికే ఎంపిక చేసిన స్థలాన్ని పరిశీలించారు. స్టేడియం నిర్మాణాలపై అధికారులతో చర్చించారు. పనులు వేగంగా జరిగేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నారు. అలాగే పట్టణం నుంచి స్టేడియంమీదుగా రింగ్‌రోడ్డు వరకు వెళ్లే రోడ్డును కూడా డబుల్ లేన్‌గా మార్చి తీర్చిదిద్దేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం సింగిల్‌రోడ్డు ఉన్న నేపథ్యంలో స్టేడియం వరకు డబుల్‌రోడ్డుగా మార్చనున్నారు.



స్టేడియంలో భవన నిర్మాణాల నమూనా



ఫుట్‌బాల్ కోర్టు

క్రీడాకారులకు మంచి రోజులు



జిల్లాలో క్రీడాకారులకు సంబంధించి అన్ని వసతులతో స్టేడియం నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నాం. క్రికెట్ స్టేడియం, ఇండోర్ స్టేడియంల ఏర్పాటుకు 25 ఎకరాల స్థలాన్ని ఎంపిక చేశాం. ఇప్పటికే వివిధ పనులు ప్రారంభమయ్యాయి. రానున్న కాలంలో అందమైన క్రికెట్, ఇండోర్ స్టేడియాలను ఏర్పాటు చేయనున్నాం. - పీఎస్ గిరీషా, జిల్లా కలెక్టర్

బ్రహ్మోత్సవం.. ప్రారంభం



కడప రాయుని సన్నిధిలో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న అర్చకులు

కడప కల్చరల్ : కడప రాయుడు దేవునికడప శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం ఆలయ అర్చకులు మచ్చా శేషాచార్యులు, మయూరం కృష్ణమోహన్, త్రివిక్రమ్‌లతోపాటు మరికొందరు వేద పండితులు దీక్షా తిరుమంజనం కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత విశ్వక్సేనునికి పూజ చేసి పుణ్యాహవాచనం నిర్వహించారు. రక్షా కంకణధారణ నిర్వహించిన అనంతరం పల్లకీలో ఊరేగింపుగా పుష్కరిణి వద్దకు టీటీడీ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డిల ఆధ్వర్యంలో తరలి వెళ్లారు. అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి మృత్సంగ్రహణం కార్యక్రమాన్ని నిర్వహించారు. దాన్ని పల్లకీలో ఊరేగింపుగా ఆలయానికి చేర్చి అంకురార్పణ చేశారు. ప్రత్యేక విద్వాంసుల నాదస్వర, మంగళ వాయిద్యాల విన్యాసాల మధ్య ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించిన అంకురార్పణ కార్యక్రమా న్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున వచ్చారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు: ఆదివారం ఉదయం 10.00 నుంచి 11.00 గంటల వరకు తిరుచ్చి ధ్వజారోహణం, సాయంత్రం 6.00 నుంచి 7.00 గంటల వరకు ఊంజల సేవ, రాత్రి టీటీడీ అన్నమాచార్యప్రాజెక్టు కళాకారుల అన్నమాచార్యుల సంకీర్తనలు నిర్వహిస్తారు. రాత్రి 7.00 నుంచి 8.00 గంటల వరకు ఉత్సవ మూర్తులను చంద్రప్రభ వాహనంపై కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించనున్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

వైఎస్సార్‌సీపీ గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల సమావేశంలో గడికోట శ్రీకాంత్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటిటౌన్: రానున్న 2024 ఎన్నికల్లో అన్ని స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పని చేద్దామని అన్నమయ్య జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు పిలుపునిచ్చారు. శనివారం రాయచోటి అభి కన్వెన్షన్ హాలులో రీజినల్ కో ఆర్డినేటర్, ఉమ్మడి వైఎస్సార్ జిల్లా జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డితో కలసి గృహసారథులు(జేసీఎస్), గ్రామ సచివాలయ కన్వీనర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో చక్కని పాలన సాగుతోందన్నారు. ప్రజల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న సానుకూల ధోరణిని ఓట్ల రూపంలో తీసుకురావాలని సూచించారు. గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు కలసి కట్టుగా పని చేస్తే 175 స్థానాలు సాధించడం కష్టమేమీ కాదన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకూ తీసుకెళ్లి వివరించి చెప్పాలన్నారు. అలాగే ప్రభుత్వంపై ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా కలసి చేస్తున్న కుట్రలను, దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని చెప్పారు. రాయలసీమలో జగన్ లాంటి దమ్మున్న నాయకుడు ఉండటం సంతోషదాయకమన్నారు. చంద్రబాబు నాయుడుకు తన పార్టీపై నమ్మకం ఉంటే ఒంటరిగా పోరాటం చేయాలని సవాల్ విసిరారు. వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్, ఉమ్మడి వైఎస్సార్ జిల్లా జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం పేదల పక్షపాతి అన్నారు. చంద్రబాబు నాయుడు తన ప్రచార ఆర్భాటాల కోసం ప్రజల ప్రాణాలను బలిగొన్నారని విమర్శించారు. చంద్రబాబు నాయుడు సైకోలా ప్రవర్తిస్తున్నారన్నారు. జగన్ మోహన్‌రెడ్డి ఒక బలమైన నాయకుడు కావడం వల్లే శత్రువులంతా ఒక్కటయ్యారని ఆరోపించారు. 80 శాతం ప్రజలు జగన్ వైపు ఉన్నారని గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు కలసి కట్టుగా పనిచేసి తిరిగి వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకు వచ్చేందుకు కృషి చేయాలని సూచించారు. ఐదు జిల్లాల కోఆర్డినేటర్ పుత్తా శివశంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రైల్వేకోడూరు, మదనపల్లె, రాజంపేట, పీలేరు, రాయచోటి నియోజకవర్గ పరిశీలకులు పులి సునీల్‌కుమార్, హబీబ్‌ఖాన్, కృష్ణమూర్తి, సహదేవరెడ్డి, కరీముల్లా మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్సీ అభ్యర్థి రవీంద్రారెడ్డికి మద్దతుగా పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, వీరబల్లి ఎంపీపీ రాజేంద్రనాథరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు చెన్నూరు అన్వర్ బాషా, మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలస్యమైతే అంతే!

- ఒక్క నిమిషం ఆలస్యమైనా లోనికి నో ఎంట్రీ
- నేడు పోలీసు కానిస్టేబుల్ అభ్యర్థులకు రాత పరీక్ష
- జిల్లాలో 13,681 మంది అభ్యర్థులకు 30 కేంద్రాల ఏర్పాటు
- అన్ని ఏర్పాట్లు పూర్తి : జిల్లా ఎస్పీ హర్షవర్దన్‌రాజు



మదనపల్లె పరీక్షా కేంద్రం వద్ద మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

సాక్షి రాయచోటి : రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు కానిస్టేబుళ్ల నియామకాలకు జరగనున్న రాత పరీక్షలకు సంబంధించి పోలీసు యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ప్రధానంగా జిల్లాలోని రాజంపేట, మదనపల్లెలలో కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 13,681 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు అవుతుండగా, వీరికోసం పోలీసుశాఖ 30 కేంద్రాలను ఏర్పాటు చేసింది. అన్నమయ్య జిల్లా ఎస్పీ హర్షవర్దన్‌రాజు ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా పటిష్ట చర్యలు చేపట్టారు.

ఉదయం 9 గంటల నుంచి లోనికి అనుమతి

పోలీసు కానిస్టేబుళ్లకు సంబంధించి ఆదివారం ఉదయం 10.00 గంటలకు పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అయితే ఎంపిక చేసిన కేంద్రాల వరకు ఉదయం నుంచే అనుమతి ఇస్తారు. పరీక్షా హాలులోనికి 9 గంటల నుంచి అనుమతి ఉంటుంది. వీలైనంత మేర పరీక్షా కేంద్రం లోనికి ప్రారంభానికి ముందే వెళ్లాలి. పరీక్ష ప్రారంభం అయ్యాక ఒక్క నిమిషం ఆలస్యమైనా కూడా అభ్యర్థులను లోనికి అనుమతించే అవకాశం లేదు. ఆలస్యం కాకుండా అభ్యర్థులు ముందస్తుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు పరీక్ష నిర్వహణ ఉంటుంది.

కట్టుదిట్టంగా కానిస్టేబుల్ అభ్యర్థులకు పరీక్ష

జిల్లాలో కానిస్టేబుల్ ఉద్యోగాలకు సంబంధించి పరీక్షల నేపథ్యంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ప్రత్యేకంగా సీసీ కెమెరాల ఏర్పాటుతోపాటు హాల్ టిక్కెట్ల తనిఖీ, సీట్ల కేటాయింపు, ఇన్విజిలేటర్ల పరిశీలనతోపాటు బయట కూడా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలకు సంబంధించి సుమారు 250-300 మంది పోలీసులను బందోబస్తుగా వినియోగిస్తున్నారు. కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. సెంటర్లు తెలియక అభ్యర్థులు ఇబ్బంది పడకూడదన్న ఆలోచనలతో ఎక్కడికక్కడ బస్టాండ్లలో పోలీసు విచారణ కేంద్రాలను కూడా ఏర్పాటు చేశారు.

పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

అన్నమయ్య జిల్లాలో పోలీసు కానిస్టేబుళ్ల రాత పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. పోలీసుశాఖ నిబంధనలు పాటిస్తూ అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి నిర్ణీత సమయం కంటే ముందుగానే చేరుకోవాలి. హాల్ టిక్కెట్‌తోపాటు ఒక ఐడీ ప్రూఫ్ ఒరిజినల్ వెంట తెచ్చుకోవాలి. అలాగే ఎలక్ట్రానిక్ వస్తువులు వెంట తెచ్చుకోరాదు. జిల్లాలోని రాజంపేట, మదనపల్లె పట్టణాల్లో 30 కేంద్రాలు ఏర్పాటు చేశాం. సీసీ కెమెరాలతోపాటు తనిఖీలు, పోలీసు బందోబస్తు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాం. - హర్షవర్ధన్‌రాజు, ఎస్పీ, అన్నమయ్య జిల్లా

బ్యాంకర్లు ఆర్థిక ప్రగతి లక్ష్యసాధనకు కృషి చేయాలి

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : బ్యాంకర్లు ప్రభుత్వ లక్ష్య సాధన దిశగా పనిచేసి జిల్లా ఆర్థికప్రగతిలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ బ్యాంకు అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పీఎంఈజీపీ, ఆరో విడత జగనన్న తోడు లబ్ధిదారులకు రుణాలు మంజూరుపై జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జగనన్నతోడు పథకంలో భాగంగా వీధుల్లో చిరు వ్యాపారులు, చేతివృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారికి పెట్టుబడి కింద బ్యాంకుల ద్వారా రూ.10 వేలు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలన్నారు. 6వ విడతకు సంబంధించి జిల్లాలో అర్బన్ ప్రాంతాలలో 3230 మంది, రూరల్ ప్రాంతాలలో 11950 మంది లబ్ధిదారులకు జగనన్న తోడు రుణాలు మంజూరు చేయాల్సి ఉందన్నారు. ఈ పథకంలో రుణం పొంది సకాలంలో చెల్లించిన వారికి అదనంగా వేయి రూపాయల వరకు రుణం ఇచ్చేందుకు బ్యాంకర్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేశ్వరరెడ్డి, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజ, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, బ్యాంకు మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

'గడప గడపకు మన ప్రభుత్వం' పనుల్లో వేగం పెరగాలి

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన పనులలో వేగం పెరగాలని అధికారులను జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి గడప గడపకు మన ప్రభుత్వం పనుల పురోగతి, జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణం పురోగతిపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, గృహనిర్మాణశాఖ డీఈలు, ఏఈలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం వందశాతం పూర్తయిన ప్రాంతాలను గుర్తించి పనులను వెంటనే చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ శివయ్య, సీపీఓ కృష్ణ నాయక్, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ ప్రసన్న కుమార్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, గృహనిర్మాణశాఖ డీఈలు, ఈఈలు, మండల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

శాస్త్రీయ దృక్పథంతోనే ఆలోచనల అభివృద్ధి

ప్రారంభమైన జేవీవీ చెకుముకి రాష్ట్ర సైన్స్ సంబరాలు

కడప కల్చరల్ : మానవుడు బుద్ధి జీవి అని, ఎప్పటికప్పుడు పరిస్థితులకు అనుకూలంగా ఆలోచించగల శక్తి మానవుడికి మాత్రమే ఉందని, ఈ ఆలోచనలు శాస్త్రీయ దృక్పథంలో సాగినపుడే సమాజం అభివృద్ధి వైపు సాగుతుందని జన విజ్ఞాన వేదిక(జేవీవీ) రాష్ట్ర నాయకుడు, ఎమ్మెల్సీ లక్ష్మణరావు అన్నారు. జేవీవీ రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు తొలిసారిగా కడపనగరంలో ప్రారంభమయ్యాయి. ప్రాంగణంలో తొలుత జెండా ఆవిష్కరణతో రెండు రోజుల కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. జేవీవీ నాయకుడు, ప్రొఫెసర్ రామచంద్రయ్యతో కలిసి లక్ష్మణరావు ఉత్సవాల పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం లక్ష్మణరావు మాట్లాడుతూ సమాజంలో ఇంకా శాస్త్రీయ దృక్పథంలో ఆలోచించడం, పాటించడం అభివృద్ధి చేసుకోవాలన్నారు. హరప్ప, మోహంజదారో నాగరికతల అభివృద్ధి గురించి వివరించారు. పిల్లల్లో శాస్త్రీయ ధోరణి పెంచడం కోసమే జేవీవీ 30 సంవత్సరాలుగా చెకుముకి సైన్స్ సంబరాలను నిర్వహిస్తోందన్నారు. నిట్ మాజీ ప్రొఫెసర్ రామచంద్రయ్య మాట్లాడుతూ రామన్ ఎఫెక్ట్‌ను కనుగొన్న సీవీ రామన్ గురించి, సైన్స్ దినోత్సవం, నోబుల్ బహుమతి గురించి విద్యార్థులకు వివరించారు. పరమాణువులు, ప్రొటాన్లు, క్లిక్ కెమెస్ట్రీ గురించి కూడా వివరించారు. సమాజంలో నేటికీ మూడ నమ్మకాలను పెంచే పెద్దలు ఉండడం దురదృష్టకరమన్నారు. చెకుముకి సైన్స్ సంబరాలు శాస్త్రీయ ధోరణి గల బాలలకు సైన్స్ పండుగ లాంటివన్నారు. తెలంగాణ జేవీవీ అధ్యక్షులు ప్రొఫెసర్ కోయ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేవుడన్న భావన, ఆవిర్భావం గురించి వివరించగా, శ్రీహరికోట డీజీఎం బాలమురళి మాట్లాడుతూ బాలల్లో అంతరిక్షం గురించి అవగాహన కల్పించేందుకు పలు పరికరాలు ప్రదర్శిస్తున్నామన్నారు. జేవీవీ రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్ మాట్లాడుతూ కార్యక్రమ విశిష్టత గురించి వివరించారు. ఈ సందర్భంగా షార్ నుంచి వచ్చిన బస్సును అతిథులు ప్రారంభించారు. పల్లవి, జ్ఞానేశ్వరి ఏర్పాటు చేసిన మెంచురల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ స్టాల్‌ను కూడా ప్రారంభించారు. ఆర్.శ్రీనివాసరెడ్డి ఏర్పాటు చేసిన సైన్స్ బుక్‌స్టాల్, ప్రదర్శనను కూడా ఏర్పాటు చేశారు. శ్రీహరి కోట నుంచి తెచ్చిన రాకెట్ నమూనాలు అందరినీ ఆకట్టుకున్నాయి. మీట్ ది సైంటిస్ట్ కార్యక్రమం విజ్ఞాన దాయకంగా సాగింది. సైన్స్ క్విజ్, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జేవీవీ ప్రతినిధులు డాక్టర్ ఓబుల్‌రెడ్డి, రఘునాథరెడ్డి, త్రిమూర్తులు, కేఎంఎంఆర్ ప్రసాద్, కుర్రా రామారావు, జిల్లా నాయకులు బాల బయన్న, వెంకటేశ్వర్లు, చెకుముకి ప్రతినిధి బాలు, వెంకట సుబ్బయ్య, రాష్ట్ర నాయకులు ఏడీ దేవదత్తం, స్థానిక ప్రతినిధులు వెంకట రామరాజు, సమత కన్వీనర్ పద్మావతి, సరస్వతి, సమీర్‌బాష, రంగనాయకులు, అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాశ్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

సగటు జీవితాల 'అష్క్'

● రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా ● ఘనంగా పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ సభలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా

కడప కల్చరల్ : 'అష్క్' పుస్తకంలోని కథలన్నీ సగటు జీవితాలను ప్రతిబింబిస్తాయని, ప్రతి హృదయాన్ని స్పృశించి కన్నీళ్లు తెప్పిస్తాయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాష అన్నారు. కడప నగరంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో యువ రచయిత షేక్ షబ్బీర్ హుసేన్ రచించిన కథల సంపుటి 'అష్క్'ను శనివారం ఆయన ఇతర అతిథులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తక్కువ సమయంలోనే షబ్బీర్ రాసిన కథలన్నీ పుస్తకంగా రావడం, అందులో సగానికి పైగా కథలు బహుమతులు పొందడం విశేషమన్నారు. ఆయన భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

ఎవరి జీవితాలను వాళ్లే..

కేంద్ర సాహిత్య అకాడెమి పురస్కార గ్రహీత ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ ముస్లింల జీవితాలపై వచ్చిన కథలు ఆయా రచయితల జీవితాల్లో ఎదుర్కొన్న సంఘటనలే కావడం విశేషమన్నారు. రచయితలు సమాజంలోని సంక్లిష్టతను అర్థం చేసుకునే దిశగా వెళ్లడం అభినందనీయమన్నారు. షబ్బీర్ కథల్లో ముస్లింల జీవితాల సహజ రూపం కనిపిస్తుందని, ఎవరి జీవితాలను వాళ్లే సరైన కోణంలో విశ్లేషించగలరని, షబ్బీర్‌కు ముస్లింల కడగండ్లను కథలుగా రాసేందుకు ఈ కోణం ఉపయోగపడిందని భావిస్తున్నామన్నారు.

సజీవ చిత్రాలు

షబ్బీర్ రచించిన కథలన్నీ సజీవ చిత్రాలని సీనియర్ కథా రచయిత షేక్ హుసేన్ సత్యాగ్ని అభివర్ణించారు. భారతీయతలో మమేకమైన ముస్లింల గురించి ఈ కథలు చెబుతాయన్నారు. మతం జోలికి వెళ్లకుండా కథకుడిగా షబ్బీర్ జీవిత సంఘర్షణలను మాత్రమే తెలుపడం ఆయన నైపుణ్యాన్ని తెలుపుతోందన్నారు.

జీవితం, సమాజ సంఘర్షణల ఏకీకృత రూపం

అష్క్ అంటే కన్నీళ్లని.. జీవితం, సమాజంలోని సంఘర్షణలను షబ్బీర్ తన కథల్లో ఏకీకృతం చేశారని సాహిత్య పరిశోధకులు తవ్వా వెంకటయ్య అన్నారు. కథల సంపుటిని సమీక్షించి ప్రతి కథను భిన్నమైన కోణాల్లో విశ్లేషించి దాని గొప్పతనాన్ని తెలిపారు. రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మానస చిన్నపరెడ్డి, ప్రముఖ కథకులు పాలగిరి విశ్వప్రసాద్‌రెడ్డి, ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, ఆచార్య ఎస్.ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్లపై విజిలెన్స్ దాడులు

తనిఖీల్లో గుర్తించిన లోటుపాట్లపై ఉన్నతాధికారులకు నివేదిక



వలసపల్లె ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని లఖి బివరేజెస్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

మదనపల్లె : విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల బృందం పట్టణంలోని వాటర్ ప్లాంట్లలో శుక్రవారం అర్ధరాత్రి వరకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి బి.ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు కడప విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలిసి పట్టణంలోని వాటర్‌ప్లాంట్లలో తనిఖీలు చేశారు. కొన్ని ప్లాంట్లకు ఫుడ్‌సేఫ్టీ, ఐఎస్ఐ, పొల్యూషన్ సర్టిఫికెట్ లేకపోవడం గుర్తించారు. అలాగే అన్ని కేంద్రాల నుంచి నీటి శ్యాంపిళ్లను సేకరించి ల్యాబ్‌కు పంపుతున్నామన్నారు. నాణ్యతాప్రమాణాలు పరిశీలించి, ప్రమాణాలకు అనుగుణంగా లేకపోతే వాటర్ ప్లాంట్ సీజ్ చేస్తామన్నారు. వీటితో పాటుగా ప్లాంటులో ఐఎస్ఐ ప్రమాణాలు, ఫుడ్‌సేఫ్టీ పర్మిషన్, జీఎస్టీ బిల్లులకు, నీటిశుద్ధికి సంబంధించిన ప్రమాణాలు, ప్రభుత్వ అనుమతులు అన్నింటిపై విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అధికారులు తనిఖీలు నిర్వహించిన వాటిలో పట్టణంలోని మునెప్పనగర్‌లోని మహానంది అక్వా ప్రొడక్ట్స్, వలసపల్లె ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని లఖి బివరేజెస్, బ్రూక్లిన్ బివరేజెస్ ప్లాంట్లు ఉన్నాయి. తనిఖీల్లో గుర్తించిన లోటుపాట్లను నివేదిక రూపంలో పొందుపరిచి తదుపరి చర్యల నిమిత్తం ప్రభుత్వానికి పంపనున్నట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఈదురుబాషా, డిప్యూటీ ఈఈ లోకేశ్వరరెడ్డి, ఏఈఈ అశోక్ కుమార్, ఫుడ్‌సేఫ్టీ అధికారి రామయ్య తెలిపారు.

రోడ్డుప్రమాదంలో ముగ్గురు యువతులకు గాయాలు



ప్రమాద వివరాలు అడిగిన పోలీసులపై గొడవకు దిగుతున్న బాధితుల బంధువు

మదనపల్లె : రోడ్డుప్రమాదంలో ముగ్గురు యువతులు తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం సాయంత్రం కోళ్లబైలు సమీపంలో జరిగింది. క్షతగాత్రులను చికిత్సల నిమిత్తం బంధువులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో ప్రమాద వివరాలను తెలుసుకునేందుకు ప్రయత్నించిన ఆస్పత్రి సెక్యూరిటీ, అవుట్‌పోస్ట్ పోలీస్, మీడియాపై బాధితుల బంధువు వీరంగం సృష్టించాడు. ప్రశాంత్‌నగర్ 5వక్రాస్‌కు చెందిన జ్ఞాపిక(19), లహరి(19), సంగీత(19)లు శనివారం ఆటో ప్రమాదంలో గాయపడ్డారు. వీరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి వచ్చారు. వారిని సిబ్బంది అత్యవసర చికిత్స విభాగంలోకి తరలించారు. వైద్యులు చికిత్సలు అందిస్తుండగా, స్థానిక అవుట్‌పోస్ట్ పోలీస్‌సిబ్బంది, ఆస్పత్రి సిబ్బంది, మీడియా ప్రతినిధులు ప్రమాద వివరాలను తెలుసుకునేందుకు ప్రయత్నించారు. ఈక్రమంలో బాధితులకు చెందిన ఓ యువకుడు ప్రమాద వివరాలు తెలిపేందుకు నిరాకరిస్తూ.. అడిగిన వారిపై దౌర్జన్యం చేస్తూ అక్కడి వారిని దుర్భాషలాడాడు.భద్రతా సిబ్బందిని పరుషపదజాలంతో దూషిస్తూ.. ఆస్పత్రిలోనికి ఇతరులను ఎలా అనుమతిస్తారంటూ ఘర్షణకు దిగాడు. పోలీసులు నచ్చచెప్పేందుకు ప్రయత్నించినా వినకపోవడంతో ఆస్పత్రిలో కాసేపు ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. తర్వాత గొడవ పడిన యువకుడిని పోలీసులు ఆస్పత్రి వెలుపలకు తీసుకురావడంతో గొడవ సద్దుమణిగింది. ఆటో ప్రమాదంలో యువతులు గాయపడితే ఆటో వివరాలు, ప్రమాదం ఎలా, ఎందుకు జరిగిందో తెలపకుండా గోప్యత పాటించడంతో ఘటన జరిగిన తీరుపై అక్కడకు చేరుకున్న పలువురు పలురకాలుగా మాట్లాడుకోవడం కనిపించింది.

అయ్యో.. చిన్నారి 'తల్లి'

గురుకుల పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని ప్రసవం



ఆసుపత్రిలో విచారణ చేపట్టిన అధికారులు

వాల్మీకిపురం : తొమ్మిదో తరగతి విద్యార్థిని ప్రసవించిన సంఘటన శనివారం అన్నమయ్య జిల్లాలో చోటు చేసుకొంది. వివరాలిలా ఉన్నాయి. వాల్మీకిపురం కొత్త ఇందిరమ్మ కాలనీ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఓ బాలిక శనివారం సాయంత్రం కడుపునొప్పి అంటూ ఇబ్బందిపడసాగింది. దీంతో పాఠశాల యాజమాన్యం బాలికను హుటాహుటిన స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తీరా వైద్యులు చికిత్సకు ఉపక్రమించిన సమయంలో బాలిక గర్భవతి అని తేలడం, నిమిషాల వ్యవధిలోనే మగ బిడ్డకు జన్మనివ్వడం జరిగిపోయింది. దీంతో డాక్టర్లు సైతం నివ్వెరపోయారు. విషయం తెలుసుకున్న స్థానిక తహసీల్దార్ ఫిరోజ్ ఖాన్, ఎస్సై బిందుమాధవి ఆసుపత్రికి చేరుకున్నారు. బాలికను మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. విషయం జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ దృష్టికి వెళ్లడంతో ఆయన పాఠశాల బాధ్యులు, అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో వారు హుటాహుటిన విచారణ చేపట్టారు. తనకు వరసకు మామ అయ్యే వ్యక్తి వల్లే బాలిక గర్భం దాల్చినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అదృశ్యం కేసు నమోదు



అదృశ్యమైన బాలిక

ములకలచెరువు : మండలానికి చెందిన బాలిక అదృశ్యమైంది. మదనపల్లి టూటౌన్ ఎస్ఐ చంద్రమోహన్ కథనం మేరకు వివరాలు... ములకలచెరువు మండలం దేవులచెరువుకు చెందిన ఫక్రుద్దీన్ సాహెబ్ కుమార్తె (17) మదనపల్లెలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతోంది. 20వ తేదీ గురువారం కళాశాలకు వెళ్లిన తమ కుమార్తె తిరిగి రాకపోవడంతో తండ్రి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అదృశ్యం కేసు నమోదు చేశామని పోలీసులు చెప్పారు. ఆచూకీ లభిస్తే 9440796741 నంబరుకు సమాచారం అందించాలని ఎస్ఐ తెలిపారు.

నిమ్మనపల్లె : బాలికపై మిస్సింగ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఫాతిమా తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలోని తవళం గ్రామం కుమ్మరపల్లెకు చెందిన బాలిక(15) ఈనెల 18 నుంచి కనిపించడం లేదు. స్థానికులు, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా కనిపించకపోవడంతో తల్లి సరస్వతి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసినట్లు తెలిపారు.

బాలిక ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : తల్లిదండ్రులు గొడవ పడుతున్నారన్న మనస్తాపంతో మైనర్ బాలిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శనివారం బి.కొత్తకోట మండలంలో జరిగింది. బొమ్మసముద్రం పంచాయతీ గుండ్లువారిపల్లెకు చెందిన బాలిక(16) తల్లిదండ్రులు తరచూ తన కారణంగా గొడవ పడుతున్నారనే బాధతో విషద్రావణం తాగింది. గమనించిన కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుప్తనిధుల కోసం ఆలయంలో తవ్వకాలు

పెద్దమండ్యం : గుప్తనిధుల కోసం పురాతనమైన ఆలయంలో శుక్రవారం రాత్రి గుప్తనిధుల ముఠా తవ్వేసినట్లు ఆలయ నిర్వాహకులు శనివారం తెలిపారు. మండలంలోని దిగువపల్లె పంచాయతీలోని గుట్ట వద్ద వరమల్లయ్య స్వామి ఆలయం ఉంది. పెద్ద పెద్ద బండరాళ్లను గుప్తనిధుల ముఠా సభ్యులు తొలగించారు. శనివారం ఉదయం పూజలు చేసేందుకు ముసలికుంటకు చెందిన ఆలయ నిర్వాహకులు వెళ్లడంతో విషయం వెలుగు చూసింది. పురాతనమైన ఈ ఆలయంలో గతంలో రెండు మార్లు గుప్తనిధుల కోసం తవ్వకాలు చేయగా పునర్నిర్మాణ పనులు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ముఠాను గుర్తించి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

అన్నదాతకు ఉపయోగపడే పరిశోధనలు రావాలి

వైవీయూ : వ్యవసాయ రంగంలో అన్నదాతకు ప్రయోజనకరమైన పరిశోధనలు జరగాలని వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య కె. కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం వైవీయూలో పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌శాఖ ఆధ్వర్యంలో 'వ్యవసాయ ప్రక్రియ సవాళ్లలో జిల్లా ప్రణాళిక' అన్న అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రైతులేనిదే ప్రజల జీవితాలు లేవని స్పష్టం చేశారు. పెరుగుతున్న జనాభాలకు అనుగుణంగా సహజమైన వాతావరణంలో కొత్త ఉత్పత్తులను సృష్టించాల్సిన అవసరం ఉందన్నారు. పూణేకు చెందిన ఎంఐటీ వరల్డ్ పీస్ విశ్వవిద్యాలయం సంచాలకులు డా. కె. గిరీశన్ మాట్లాడుతూ తమిళనాడులో జిల్లా ప్రణాళిక యొక్క ప్రక్రియ, సవాళ్ల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

క్రీడలతో మానసికోల్లాసం



న్యాయవాదులతో కలిసి క్యారమ్స్ ఆడుతున్న 3వ అదనపు జిల్లా జడ్జి మురళీకృష్ణ

రాజంపేట రూరల్ : క్రీడలతో మానసికోల్లాసం పొందొచ్చని 3వ అదనపు జిల్లా జడ్జి మురళీకృష్ణ పేర్కొన్నారు. స్థానిక బార్ అసోషియేషన్ కార్యాలయంలో రిపబ్లిక్ డేను పురస్కరించుకొని శనివారం గేమ్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. న్యాయవాదులతో కలిసి క్యారమ్స్ ఆడారు.సీనియర్ సివిల్ జడ్జి సరస్వతి, జూనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

బోయనపల్లి జెడ్పీ హైస్కూల్‌లో

న్యాయ విజ్ఞాన సదస్సు

మండల పరిధిలోని కొత్త బోయినపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జూనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. కే బోయినపల్లి ప్రజలు, సచివాలయ సిబ్బంది, న్యాయవాదులు, మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ సిబ్బంది పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూల్ అకస్మిక తనిఖీ

పరిసరాల అపరిశుభ్రతపై డీఈఓ ఆగ్రహం




విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ రాఘవరెడ్డి

రాజంపేట టౌన్ : మండలంలోని బోయినపల్లె జెడ్పీ హైస్కూల్‌ను డీఈఓ రాఘవరెడ్డి శనివారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాల పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉండటంత హెచ్ఎం శ్రీనివాసులుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలకు ఇద్దరు ఆయాలు ఉన్నప్పటికీ పరిసర ప్రాంతాలను అపరిశుభ్రంగా ఉంచుకోవడం ఏమిటని హెచ్ఎంను ప్రశ్నించారు. అనంతరం తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులకు వారి పాఠ్యాంశాలకు సంబంధించిన ప్రశ్నలు వేసి సామర్థ్యాన్ని తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల బోధనా పనితీరును పరిశీలించారు. ఓ తరగతి గదిలోకి వెళ్లగా సోషల్ టీచర్ శారద సెల్‌ఫోన్ చూస్తూ ఉండటాన్ని గమనించారు. బోర్డుపై ఇంగ్లీష్‌లో సర్వీస్ అనే పదాన్ని రాయమని ఆ ఉపాధ్యాయినిని డీఈఓ ఆదేశించారు. దీంతో ఆమె హడావుడిగా బోర్డుపై సర్వీస్ అనే పదాన్ని ఇంగ్లీష్‌లో రాయడం వల్ల స్పెల్లింగ్ మిస్టేక్ చోటుచేసుకోవడంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల వద్ద టీచింగ్ డైరీ ఉందో లేదో తెలుసుకునేందుకు రికార్డులను తనిఖీ చేశారు. ప్రతి పాఠ్యాంశానికి సంబంధించి ఇప్పటి వరకు నిర్వహించిన పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనను పరిశీలించారు. మార్కులను సంబంధిత పోర్టల్‌లో అప్‌లోడు చేశారా లేదా అని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఆవరణ అపరిశుభ్రతగా ఉన్న కారణంగా హెచ్ఎంపై, తరగతి గదిలో సెల్‌ఫోన్ చూస్తూ ఉన్న ఉపాధ్యాయిని శారదపై చర్యలు తీసుకుంటారా అని డీఈఓను అడగ్గా షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిపారు. ఇదిలావుంటే విద్యార్థులకు హాజరు వేశాక సెల్‌ఫోన్‌లో అప్‌లోడ్ చేయగా నెట్ సరిగా లేనందున హాజరు ప్రక్రియ వెంటనే పూర్తికాలేదని, అందువల్ల సెల్ చూస్తూ ఉండాల్సి వచ్చిందని, ఆ సమయంలో డీఈఓ తన తరగతి గదిలోకి వచ్చారని ఉపాధ్యాయిని శారద తెలిపారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధకు చర్యలు

కడప ఎడ్యుకేషన్ : బేస్ లైన్ పరీక్ష ఆధారంగా చదువులో వెనుకబడిన విద్యార్థులలో సామర్థ్యాలను మెరుగు పరిచే కార్యక్రమంలో భాగంగా 6,7,8 తరగతులు బోధిస్తున్న ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకునేలా డీఆర్‌పీలు చర్యలు తీసుకోవాలని కడప, అన్నమయ్య జిల్లాల డీఈఓలు దేవరాజు, రాఘవరెడ్డిలు సూచించారు. శనివారం కడప గాంధీనగర్ హైస్కూల్లో జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలానికి ఒకరి చొప్పున ఎంపికైన డీఆర్‌పీలకు లిప్(లర్నింగ్ ఇంప్రుమెంట్ ప్రోగ్రాం)లో రిపోర్టు తయారీపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా కారణంగా విద్యార్థులు సామర్థ్యాలు వెనుకబడి పోయారని వాటిని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం లర్నింగ్ ఇంప్రుమెంట్ ప్రోగ్రాం(లిప్) అమలు చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే విద్యార్థులకు చదవడం, రాయడం ఇంప్రుమెంట్ చేయడం లక్ష్యం అన్నారు. సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యాభివృద్ధిని పెంపొందించడంతోపాటు రాయడం, చదవడం పెంచాలనేదే ప్రభుత్వ లక్ష్యం అన్నారు.

ఏపీజీఈఏ నేతలు గవర్నర్‌ను కలవడం సరికాదు



మాట్లాడుతున్న ఏపీ ఎన్‌జీఓ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్‌యాదవ్

రాయచోటి అర్బన్ : ఉద్యోగుల సమస్యల పరిష్కారం పేరుతో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నేతలు గవర్నర్‌ను కలవడం సరిరి కాదని ఏపీ ఎన్‌జీఓ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్‌యాదవ్, రాయచోటి అధ్యక్ష,కార్యదర్శులు వేణుగోపాల్ రెడ్డి, వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం ఎన్‌జీఓ సభాభవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 12వ పీఆర్సీ సాధన సమయంలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నేతలు సమస్యల పరిష్కారం కోసమంటూ గవర్నర్‌ను కలవడం సరైన పద్ధతి కాదన్నారు. ఉద్యోగులను మభ్యపెట్టడానికే ఏపీజీఈఏ నేతలు గవర్నర్‌ను కలవడం జరిగిందని విమర్శించారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేది ముఖ్యమంత్రే తప్ప గవర్నర్ కాదన్నారు. ప్రభుత్వం సంక్రాంతికి డీఏ ఇస్తామని చెబుతుంటే ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ సంక్రాంతి తోఫా, దసరాతోఫా, రంజాన్‌తోఫాలు మంజూరు చేయాలనడం దారుణమన్నారు. తరచూ ఎన్ జీఓ సంఘంపైన, ఎన్‌జీఓ హోంలపైన విషం చిమ్ముతూ మాట్లాడడం అభ్యంతకరం అన్నారు.సూర్యనారాయణకు నిజంగా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఉంటే ఏప్రిల్ నుండి కార్యాచరణ చేయడం ఎందుకు ? వెంటనే పోరాటం మొదలు పెట్టవచ్చుకదా అని అన్నారు. ఇప్పటికైనా తమ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శుల పై దూషణలు ఆపి ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారం కోసం పోరాటం చేయాలన్నారు. సమావేశంలో లక్కిరెడ్డి పల్లె ఎన్‌జీఓ సంఘం అధ్యక్షుడు బలరామ రాజు, రాయచోటి సంఘం ఉపాధ్యక్షుడు మహమ్మద్‌బాష, మణికంఠ, కోశాధికారి నాగరాజు, సహాయ కార్యదర్శి మహ దేవ, మహిళా నాయకురాళ్ళు ప్రతిభకుమారి, యం.వరలక్ష్మి,పద్మజలు పాల్గొన్నారు.